## మున్నుడి

వైష్ణవుడై యుండట మంటే పెద్ద పెద్ద పంగనామాలు ధరించి శంఖుచక్రాలు భుజకీర్తులుగా ధరించి మడీదడీ అని ఆచారం పాటించి ఏవేవో మంత్రాలు చదివి పూజలు చేయటంకాదు అంటున్నారు అన్నమాచార్యులవారు. మతము మనోనిగ్రహానికి రాచబాటకావాలి కానీ ఏవేవో ఆచారాలు మాత్రమే అవసరం అని చేప్పేనిరంకుశం కాకూడదు. నాడు గీతాచార్యుడు చెప్పిన ధర్మం వదలివేసి ఏవేవో ధర్మాల వెంటబడితే ప్రయోజనం శూన్యం. ఈ చెవితో విని ఆచెవితో వదిలేయక వినండి మరి...

**చం॥ ఘనమగు వైష్ణవం బనగ కాదుర యొక్కమతంబు మాత్రమే**
**వినుమని సారమంత విడిబెట్టెను అన్నమయ తాళ్ళపాకలో**
**గొనకొని సర్వధర్మముల గ్రుంకక దిక్కని వేంకటేశునే**
**మనమున నెంచుమా శరణు మాకిక నీవని 'వైష్ణవం' బదే.**

**రాగం : మలహరి**

వలెనను వారిదె - వైష్ణవము- ఇదె
వలపు దేనె పో-వైష్ణవము ॥వలెనను॥

కోరిక లుడుగుచు-గుఱి నిన్నిటిపై
వైరాగ్యమె పో-వైష్ణవము
సారకు గోపము-జలముదనలో
వారించుట పో-వైష్ణవము ॥వలెనను॥

సుడిగోను దేహపు-సుఖదుఃఖములో
వడి జొరనిదె పో-వైష్ణవము
ముడివడి ఇంద్రియ-ముల కింకరుడై
వడబడ నిదెపో-వైష్ణవము ॥వలెనను॥

ఉదుటున దన సక-లోపాయంబులు
వదలుట పో నిజ- వైష్ణవము
ఎదుటను శ్రీవేంక-టేశ్వరు నామము
వదనము చేర్చుట పో- వైష్ణవము. ॥వలెనను॥

భావామృతం :

ఎవరు నాకు కావాలి అని స్వీకరించితే వారిదే వైష్ణవము. ఈ వైష్ణవతత్త్వము జాతి, దేశ పరిమితులు లేక మకరందపు సౌరభాలను యెల్లెడల విరజిమ్ముతుంది పో. దీంట్లో సందేహం లేదు.

మనస్సులో వివిధమైన కోరికలను విడనాడి, భోగములపై విముఖులై వైరాగ్యభావం అలవరచుకొనుటయే పో వైష్ణవమంటే. ప్రతిసారీ తనలో తొంగిచూచే క్రోధాన్ని నిగ్రహించి తలయెత్తకుండా అదుపులో వుంచటమే పో వైష్ణవమంటే. (దాంబికంగా నామాలు పెట్టుకోవటం కాదు).

సుడిగాలిలా చుట్టుముట్టి దేహాన్ని వ్యాకులపరుస్తుంటాయి సుఖ దుఃఖములు. నిజమైన వైష్ణవమంటే ఈ ద్వంద్వముల పీడనుంచి విముక్తుడవుటయే పో. వేరేమీ కాదు. విడిచిపెట్టకుండా తగులుకొని వేదించే ఇంద్రియములకు బానిసకాకుండ, వాటికి లొంగిపోకుండుటయే పో వైష్ణవం అంటే. (ఇంకామరేమియూకాదు).

పూనికతో సర్వధర్మములను పరిత్యజించి సర్వేశ్వరునికి శరణాగతి నొందుటయే పో వైష్ణవమంటే. వదలక ప్రత్యక్షముగా మనయెదుసున్న శ్రీవేంకటేశ్వరుని నామమును (బొట్టుకాదు) నీ వదనమున చేర్చుట అంటే నోటితో పలుకుటయే పో (ముఖంపై పెట్టుకోవటంకాదు) వైష్ణవం అంటే. ఇవేవీ చేయకుండా ఏవేవో ఆచారాలు పాటించి మడీదడీ అంటే అది వైష్ణవం కానే కాదు.

వలెననువారిదె వైష్ణవము యిది
వలపుఁదేనెవో వైష్ణవము ॥పల్లవి॥

కోరిక లుడుగుచు గుణి నిన్నిటిపై
వైరాగ్యమెపో వైష్ణవము
సారెకుఁ గోపముఁ జలమును( దనలో
వారించుటవో వైష్ణవము ॥వలె॥

సురిగొను దేహపుసుఖదుఃఖములో
వడిఁ జొరనిదెపో వైష్ణవము
ముదివడి యింద్రియములకింకరుఁడై
వడఁబడనిదెపో వైష్ణవము ॥వలె॥

వుదుటునఁ దనసకలోపాయంబులు
వదలుటపో నిజవైష్ణవము
యెదుటను శ్రీవేంకటేశ్వరునామము
వదనముచేర్చుట వైష్ణవము ॥వలె॥ 405